# జైలు కథలు 10

# దోషి



ఆదివారం. ఉదయం క్రైస్తవుల భక్తి పాటలు విన వస్తున్నాయి రేడియోలో. వింటూ కూర్చున్నాను. కర్ణపుటాలకు హాయిగా సోకుతూ వున్నాయి పాటలు.

"గుడ్ మార్నింగ్ ప్రసాద్."

ఎవరిదో అపరిచిత స్వరం విని దృష్టి మరల్చాను.

"వెరీ గుడ్ మార్నింగ్" రిప్లయ్ విష్ చేశాను.

"మీ పేరు."

"జంగయ్య. నిన్ననే వచ్చాను."

"ఏమిటి విషయం."

"అంతా చెప్పి మీ సలహా తీసుకుందామనే వచ్చాను."

"చెప్పండి" అన్నాను.

జ్ఞాపకం కొరకు కాబోలు కొంచెం సేపాగి చెప్పడం ప్రారంభించాడు :

జంగయ్యది షాద్‌నగర్ వద్దనున్న చిన్న పల్లె. ఇంటర్ వరకూ చదివాడు. మహబూబ్‌నగర్ డైరీ ఫారం వారికి అతని స్వగ్రామంలో పాలు పట్టి పంపుతుండేవాడు. అతనికి సహాయకారిగా వుండేవాడు కిష్టయ్య. ఇద్దరూ చేదోడు వాదోడుగా పని చేసుకుంటూ హాయిగా కాలం గడుపుతున్నారు. జంగయ్యవద్ద దురలవాట్లు ఏమీలేవు. కాని అదే గ్రామంలో ప్రయిమరీస్కూల్లో పనిజేస్తున్న వర్ధనమ్మ టీచర్‌తో పరిచయమైంది. ఆ పరిచయం శారీరక సంబంధానికి దారితీసింది. జంగయ్య అవివాహితుడు. వర్ధనమ్మ వివాహిత. ఇది తప్పు అని గ్రహించేలోపునే పరిస్థితి చాల దూరం పోయింది. ఆ గ్రామంలో ఈ విషయం అందరికీ తెలిసిపోయింది. వర్ధనమ్మ భర్త హైదరాబాద్‌లో వుద్యోగం చేస్తున్నాడు. అతను వేరుగా వుండటం వారికి ఇంకా అవకాశ మిచ్చింది.

కాలం గడిచేకొద్దీ వీరి బంధం మరింత బలపడింది. కాని వృద్ధులైన తల్లిదండ్రులు ఇది సహించలేకపోయారు. జంగయ్యను బ్రతిమాలి పెండ్లికి వొప్పించారు. సంబంధం నిశ్చయమైంది. పెండ్లికి అంతా సిద్ధపడ్డారు. నగలు, బట్టలు అన్నీ కొన్నారు. జంగయ్య తల్లిదండ్రులు చకచకా అన్ని పనులూ చేసుకుపోతున్నారు.

పెండ్లి ఇంకా పది రోజులు మాత్రమే వుంది. జంగయ్యకు పెండ్లి నిశ్చయం కావడం వర్ధనమ్మకు యిష్టంలేకపోయింది. తనవస్తువేదో తననుండి బలవంతంగా ఎవరో లాక్కుపోతున్నట్లుగా బాధపడింది. ఓర్పు నశించింది. వివేకం కోల్పోయింది. పిల్ల తల్లిదండ్రులకు తమకున్న అక్రమ సంబంధాన్ని గూర్చి జాబు వ్రాసింది. కాని ప్రయోజనం లేకపోయింది. జంగయ్య ఆమెకు విషయం అర్థంఅయ్యేట్లు చెప్పాడు. తన తల్లి దండ్రులకు కష్టం కలిగించలేక తానా పెండ్లి కంగీకరించానని. సహృదయంతో అర్థంచేసుకొని తనను మరచిపొమ్మని వివేకం చెప్పాడు. కాని వర్ధనమ్మకు ఈ మాటలు తలకెక్కలేదు. సహించలేక పోయింది. ఒకరోజు ఆహారం లేకుండా కాలం గడిపింది. అయినా మొరాయించిన మనసును సముదాయించలేక పోయింది. ఆఖరుకు భయంకరమైన నిర్ణయాన్ని తీసికొంది.

ఆ రోజు రాత్రి దూలానికి వ్రేళ్ళాడుతున్న తాడు ఆమె నిండు జీవితాన్ని తీసికొంది. తెల్లారిన తరువాత కిష్టయ్య ఆమెకు పాలు యివ్వడానికి ఇంటికి వెళ్ళాడు. దృశ్యంచూసిన కిష్టయ్యకు మతిపోయింది. పరుగునపోయి జంగయ్యకు తెలిపాడు. జంగయ్యకు ఏమిచేయాలో పాలుపోలేదు. శరీరం అంతా భయంతో వణుకుతూంది. విషయం గ్రామాధికారికి విన్నవించాడు. కుటిలస్వభావుడైన గ్రామాధికారి పొమ్మని సలహాయిచ్చి పోలీసు రిపోర్టు యిచ్చాడు. జంగయ్య ఈ ఘోరానికి కారకుడని. వర్ధనమ్మ పెండ్లికి అడ్డమైందని జంగయ్యే ఆమెను గొంతునులిమి చంపి. తరువాత ఆత్మహత్యగా నిరూపించ ప్రయత్నించాడని. జంగయ్యను తరువాత గాలించి పట్టుకొని హత్యాపరాధాన్ని మోపారు.

"ఎడ్వొకేట్‌ను పిలిపించి మాట్లాడండి"-నా సలహా విన్నాడు.

"కాని ప్రసాద్! వర్ధనమ్మ వ్రాసినట్లుగా చెప్పబడుతున్న మరణ వాఙ్మూలపు జాబు సృష్టించారు పోలీస్‌వారు." భయంతో మాటలు తడబడ్డాయి.

"అయినా ఫరవాలేదు. ముందు కేసు నడిపించండి. ఆ తరువాత భారం దేవుని మీద వేయండి."

జంగయ్య వెళ్ళిపోయిన తరువాత అనుకున్నాను. "నైతికంగా ఈ నేరంలో జంగయ్య దోషి"....అని.

—ప్రసాద్